క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కూడారై ఉత్సవం



ఆగిరిపల్లి: , ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో కూడారై ఉత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లక్ష్మీనరసింహ స్వామికి, గోదాదేవికి ఉదయం సుప్రభాత సేవ, నిత్య ఆరాధన, విశేష స్నపన, తిరుప్పావై సేవా కాలం, 108 రకాల నివేదనను సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సాయి పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

చాట్రాయి: సంక్రాంతి పండుగ సందర్భంగా చిన్నారులు గాలిపటాలు ఎగుర వేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భవనాలపై ఎక్కి గాలిపటాలు ఎగుర వేయవద్దని, విద్యుత్ తీగలు లేని ప్రదేశంలో ఎగువేయాలని ఆయన సూచించారు.

800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

చాట్రాయి: సారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నూజివీడు ఎక్సైజ్ ఎస్‌ఐ మస్తానరావు అన్నారు. పోతనపల్లిలో సారా తయారీ కేంద్రాలపై శనివారం దాడులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ దాడుల్లో 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని సారా తయారీదారుడు ధారావతు బుజ్జిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

కాలు దువ్వనున్న పందెం కోళ్లు

- పలుచోట్ల బరుల ఏర్పాటు
- సిద్ధమవుతున్న జూదరులు
- చేతులు మారనున్న లక్షలాది రూపాయలు

నూజివీడు: సంక్రాంతి సందర్భంగా నూజివీడు నియోజకవర్గ వ్యాప్తంగా కోడి పందేలు నిర్వహించేందుకు జూదరులు సిద్ధమవుతున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన కోడి పుంజులను, ఏడాది పొడవునా పెంచి పందేలకు సిద్ధం చేశారు. సంక్రాంతి పండుగ సమీపించడంతో నియోజకవర్గంలోని పల్లెల్లో కోడిపందేల సందడి మొదలైంది. సంక్రాంతి పండుగ మూడు రోజులు భారీగా కోడి పందేలు నిర్వహించేందుకు బడా జూదరులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటికే నాలుగు మండలాల్లో కోడి పందేల బరులు సిద్ధమయ్యాయి. ఏటా నిర్వహించే భారీ పందేల్లో సంక్రాంతి మూడు రోజుల్లో కోట్లాది రూపాయలు చేతులు మారతాయి. పగలు కోడి పందేలు, చీకటి పడగానే



నూజివీడు మండలం తుక్కులూరులో కోడి పందేలకు సిద్ధం చేసిన బరి

కోసులు నిర్వహిస్తుండటంతో బడా జూదరులు ఆ మూడు రోజులు అక్కడే ఉంటారు.

జూదాల నియంత్రణకు పోలీసుల యత్నం

నియోజకవర్గంలో నూజివీడు మండలం మిట్టగూడెం, తుక్కులూరు, సుంకొల్లు, గొడుగువారిగూడెం , మైలవరం రోడ్డులో, ముసునూరు మండలంలో గోపవరం, చెక్కపల్లి, కాట్రేనిపాడు, గుడిపాడు, వేల్పుచర్ల, చింతలవల్లి, ఆగిరిపల్లి మండలంలోని ఈదర, చిన్నాగిరిపల్లి, నెక్కలంగొల్లగూడెం, అమ్మవారిగూడెం, ఈదులగూడెం, చాట్రాయి మండలంలో చిత్తపూర్, జనార్దనవరం, చాట్రాయి తదితర ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ పందేలకు కాకి, డేగ, రసంగి, నెమలి, పూల తదితర రకాల పుంజులను జూదరులు సిద్ధం చేసుకుంటున్నారు. హైకోర్టు అనుమతి లేనందున కోడి పందేల నిర్వహణను నియంత్రించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. కోడి పందేలు నిర్వహిస్తే హైకోర్టు ఉత్తర్వుల మేరకు చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వీఆర్వోలతో, పోలీసు సిబ్బందితో గ్రామాల్లో ప్రజలకు తెలియజేస్తున్నారు.

తుక్కులూరులో రెండు బరులు ఏర్పాటు

నూజివీడు మండలం తుక్కులూరులో కోడి పందేల నిర్వహణకు రెండు బరులు ఏర్పాటు చేశారు. ఇక్కడ టీడీపీలో రెండు వర్గాలు ఉండటంతో చెరొక బరిని సిద్ధం చేశారు. మండల వ్యాప్తంగా ఉన్న జూదరులను ఇక్కడికి రప్పించి కోడి పందేలను పెద్దఎత్తున నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

జూదాలకు దూరంగా ఉండాలి

నూజివీడు పట్టణ సీఐ పి. సత్యశ్రీనివాస్

నూజివీడు: సంక్రాంతి పర్వదినం సందర్భంగా జూదాలు నిర్వహించకుండా కబడ్డీ, క్రికెట్, షటిల్, వాలీబాల్ వంటి క్రీడలు నిర్వహిస్తే యువత జూదాల వైపు వెళ్లకుండా ఉంటారని పట్టణ సీఐ పి. సత్యశ్రీనివాస్ అన్నారు. నూజివీడులో శనివారం జూదాలను నిర్వహించొద్దు, పాల్గొనొద్దు నినాదంతో యువకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఐ జ్యోతిబసు, సిబ్బంది పాల్గొన్నారు. నూజివీడు మండలంలోని మర్రిబంధంలో రూరల్ సీఐ కె. రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రజలు పండుగ సందర్భంగా జూదాలకు దూరంగా ఉండాలని సూచించారు. రూరల్ ఎస్‌ఐ ఎన్ లక్ష్మణ్‌బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

- చాట్రాయి: చనుబండలో పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఐ డి. రామకృష్ణ



చనుబండలో ర్యాలీ నిర్వహించిన పోలీసులు

మాట్లాడుతూ యువకులు కోడి పందేల్లో పాల్గొని వివాదాల్లో ఇరుక్కోవడంతోపాటు ఆర్థికంగా నష్టపోతున్నారని చెప్పారు. సంప్రదాయ క్రీడలు ఆడుకోవాలని ఆయన సూచించారు.

కోడి పందేల బరులు ధ్వంసం

సంక్రాంతి సందర్భంగా మండలంలో కోడి పందేలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన బరులను పోలీసులు శనివారం ధ్వంసం చేశారు. చనుబండ, ఆరుగొలనుపేట, జనార్దనవరం, చిత్తపూరు గ్రామాల్లో సిద్ధం చేసిన బరులను ధ్వంసం చేశారు.

కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఎస్‌ఐ చిరంజీవి హెచ్చరిక

ముసునూరు: కోడి పందేలు, జూద శిబిరాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ ఎం.చిరంజీవి హెచ్చరించారు. మండలంలోని చెక్కపల్లిలో ఎస్‌ఐ ఆధ్వర్యంలో కోడి పందేలు, జూద శిబిరాల నిరోధంపై శనివారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. తొలుత చెక్కపల్లి, కాట్రేనిపాడుల్లో భారీ స్థాయిలో ఏర్పాటు చేసిన కోడిపందేల బరులను ఆయన ధ్వంసం చేయించారు. కోడి పందేలు, పేకాట శిబిరాలు ఏర్పాటు చేసే వారిని ఇప్పటికే బైండోవర్ చేశామని, ప్రవర్తనా తీరులో మార్పు రాకుంటే రౌడీషీట్లు తెరుస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కపల్లిలో కోడి పందేల బరిని ధ్వంసం చేయిస్తున్న ఎస్‌ఐ ఎం.చిరంజీవి

గోకులం షెడ్డు ప్రారంభం



గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న మంత్రి పార్థసారథి

ఆగిరిపల్లి: అడవినెక్కలంలో మంత్రి పార్థసారథి శనివారం పర్యటించారు. స్థానికంగా నిర్మించిన గోకులం షెడ్డును మంత్రి ప్రారంభించి మాట్లాడుతూ గ్రామాల్లో పశుపోషణ, కోళ్లు, మేకల పెంపకానికి మెరుగైన వసతి కల్పిస్తూ పెంపకందారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పశువుల నివాసానికి కొద్దిపాటి స్థలం ఉంటే మినీ గోకులం పథకంలో షెడ్డులు నిర్మించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చెప్పారు. పాడి రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బలివే దుకాణాల సముదాయానికి వేలం

ముసునూరు: మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా బలివే రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు నిర్వహించిన వేలం ద్వారా రూ.13 లక్షల 10వేల ఆదాయం లభించిందని ఈఓ పామర్తి సీతారామయ్య తెలిపారు. శనివారం ఆలయం వద్ద దేవదాయ శాఖ తనిఖీదారు అనూరాధ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజల సమక్షంలో దేవదాయ శాఖాధికారులు దుకాణాల సముదాయాలు, కొబ్బరి చిప్పల సేకరణ కోసం వేలం నిర్వహించారు. దుకాణాల ఏర్పాటు హక్కు కోసం నిర్వహించిన వేలంలో బలివేకు చెందిన పిల్లి రెడ్డియ్య రూ.13.10 లక్షలకు పాట దక్కించు కోగా, కొబ్బరి చిప్పల సేకరణకు పోల్నాటి సూరన్న రూ.1.30 లక్షలకు పాట దక్కించుకున్నారని చెప్పారు. గత ఏడాది కన్నా రూ.28 వేలు అధిక ఆదాయం లభించిందని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

102 కోడి కత్తులు స్వాధీనం

నూజివీడు: పట్టణంలోని గొడుగువారిగూడెంకు చెందిన కోడికత్తుల తయారీదారుడు పట్నాల తిరుపతయ్య (33) ఇంట్లో పట్టణ సీఐ పి. సత్యశ్రీనివాస్, ఎస్‌ఐ జ్యోతిబసు శనివారం తనిఖీలు నిర్వహించి 102 కోడికత్తులను స్వాధీనం చేసుకున్నారని డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ తెలిపారు. కోడికత్తులతో పాటు వాటిని తయారు చేసే యంత్రాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ కోడిపందేలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, ఎవరైనా పందేలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అభివృద్ధిపథంలో గొల్లపూడి, గుంటుపల్లి



గొల్లపూడి గ్రామ పరిధిలోని హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్



జాతీయ రహదారిపై పశ్చిమ బైపాస్ బ్రిడ్జి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి, ఇబ్రహీంపట్నం మండలంలోని గుంటుపల్లి గ్రామాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయి. 65వ నంబర్ జాతీయ రహదారిలో పక్కనే ఉన్న ఈ రెండు గ్రామాల మధ్య నూతనంగా పశ్చిమ బైపాస్ నిర్మించారు. ఈ రహదారి వినియోగంలోకి రావడంతో ఆయా గ్రామాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. మైలవరం నియోజకవర్గం పరిధిలోని గొల్లపూడి, గుంటుపల్లి గ్రామాలు విజయవాడ నగర శివార్లుగా ఉన్నప్పటికీ దాదాపుగా నగరంలో కలిసిపోయాయి. రైతువారీ గ్రామాలైనప్పటికీ కాలక్రమేణా పెరుగుతున్న జనాభా, వారి అభిరుచులకు అనుగుణంగా ఆధునిక భవనాలు, అపార్టుమెంట్లతో నగర వాతావరణం సంతరించుకుంది. సామాన్య, మధ్య తరగతి ప్రజలు విజయవాడ నగరంలో గజం స్థలం కూడా కొనలేని పరిస్థితులు నెలకొనడంతో అటువంటివారంతా గొల్లపూడి, గుంటుపల్లి గ్రామాల్లో స్థలం లేదా కట్టిన ఇల్లు కొనుక్కుని ఉంటున్నారు. ముఖ్యంగా ప్రశాంతమైన వాతావరణాన్ని కోరుకునే ఉద్యోగులు ఈ గ్రామాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు.

పుంజుకున్న రియల్ ఎస్టేట్

రాష్ట్ర విభజన అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో అధిక శాతం గొల్లపూడి, గుంటుపల్లి గ్రామాల్లో నెలకొల్పడంతో హైదరాబాద్ నుంచి విజయవాడకు తరలివచ్చిన ఉద్యోగులు, సిబ్బంది గొల్లపూడి, గుంటుపల్లి గ్రామాలకు చేరడంతో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంది. బిల్డర్లు, మధ్యవర్తుల వ్యాపారం మూడు పూలు..ఆరు కాయల చందాన సాగుతోంది. మొత్తం మీద గొల్లపూడి, గుంటుపల్లి గ్రామాలు రోజురోజుకు విస్తరిస్తూ అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయి.

విద్యా సంస్థలు, రెసిడెన్షియల్ కాలేజీలు

గొల్లపూడి గ్రామంలో ప్రముఖ విద్యా సంస్థలకు సంబంధించి రెసిడెన్షియల్ కాలేజీలు ఉండటం కూడా వారికి కలిసి వచ్చింది. వైద్యానికి సంబంధించి పేరొందిన కార్పొరేట్ హాస్పటల్స్ బ్రాంచిలను ఏర్పాటు చేశారు. గతంలోవలే వైద్యం కోసం టూ టౌన్‌కు వెళ్లాల్సిన పనిలేకుండానే అందుబాటులోకి ఆధునిక వైద్యం వచ్చింది.

హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్

వైద్య సేవలతోపాటు వాణిజ్య రంగానికి సంబంధించి మహాత్మాగాంధీ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ గొల్లపూడిలోనే ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు అన్నీ అందుబాటులో ఉండటంతో హ్యాపీగా ఫీలవుతున్నారు. ఇక ఫుడ్ రెస్టారెంట్లు, స్వీట్ షాపులు, ఫంక్షన్ హాల్స్ ఇబ్బడిముబ్బడిగా ఉన్నాయి.

ఆధ్యాత్మికతలోనూ..

ఆధ్యాత్మికంగా చూసినా ప్రసిద్ధి చెందిన అయ్యప్ప స్వామి దేవస్థానం, శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం, శివాలయం, గంగానమ్మ గుడితోపాటు రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనరేట్ కార్యాలయం కూడా గొల్లపూడి గ్రామంలో ఉంది.



గొల్లపూడి అయ్యప్ప స్వామి దేవాలయం



గొల్లపూడిలోని సీజన్స్ స్టే లాడ్జి

క్లుప్తంగా

ఓబన్నకు నివాళి



పెనుగొలను(గంపలగూడెం): స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమం పెనుగొలనులో శనివారం వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి ఓబన్న సేవలను కొనియాడారు.

• ఇబ్రహీంపట్నం: వడియరాజుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలు ఇబ్రహీంపట్నంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై వడ్డే ఓబన్న చిత్రపటానికి నివాళులర్పించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

• మైలవరం: ఓబన్న సేవలు చిరస్మరణీయమని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మైలవరం వడ్డెర బజారులో ఏర్పాటుచేసిన ఓబన్న విగ్రహాన్ని ఎమ్మెల్యే శనివారం ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి ఆయన జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. స్థానిక నాయకులు, వడ్డెర సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మినీ గోకులం ప్రారంభం

మైలవరం: రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేట శివారు సీతారామపురంలో మినీ గోకులం పథకాన్ని శనివారం ప్రారంభించారు. టీడీపీ మండల నాయకుడు ముప్పిడి నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా పాడి పశువుల పెంపకం, పాల ఉత్పత్తి, రైతుల ఆర్థిక స్థిరత్వానికి తోడ్పడుతుందన్నారు. నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జూదాలకు సర్వం సిద్ధం

- ఆర్థికంగా నష్టపోతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలు
- తెలంగాణ నుంచి కూడా జూదరుల రాక
- తిరువూరు డివిజన్‌లో రూ.25 కోట్ల మేర జూదాలు

తిరువూరు: తిరువూరు ప్రాంత యువత సంక్రాంతి జూదాల్లో పాల్గొనడానికి ఉవ్విళ్లూరుతున్నారు. ఈ జూదాల్లో పేకాట, గుండాట, పులి–మేక, లోన–బయట, కోడిపందేల్లో ఆడేవారి కంటే నిర్వాహకులకే లాభమని తెలిసినా ఎన్టీఆర్, ఖమ్మం జిల్లాల నుంచి తిరువూరుకు వ్యసనానికి లోనైన జూదరులు అధిక సంఖ్యలో రానున్నారు. రాజకీయ ప్రముఖులు, బుల్లితెర, సినిమా నటులు, కళాకారులు, ఎన్ఆర్ఐలు కూడా తిరువూరు ప్రాంతంలో జరిగే జూదాలను వీక్షించేందుకు వస్తున్నారు. ప్రతి ఏడాదీ సంక్రాంతి సందర్భంగా జరిగే జూదాల్లో తిరువూరు డివిజన్‌లో రూ.25 కోట్లకు పైగా చేతులు మారతాయి. నాలుగు మండలాల్లో పెద్ద బరులు 10, చిన్న బరులు 20 వరకు నిర్వహిస్తుండగా, కోడి పందేల్లో ముసుగు పందేలకు ఎక్కువ డిమాండ్ ఉంది. నాలుగైదు పుంజులకు ముసుగుకట్టి ఒకేసారి బరిలోకి వదులుతారు. గెలిచిన పుంజుపై పందెం కాసిన వారికి ముసుగు పందెంలో డబ్బు దక్కుతుంది.



జూదరుల జేబులు గుల్ల చేసే జూదాలు (ఫైల్)

జూదరులకు ప్రత్యేక ఏర్పాట్లు

జూదాల్లో పాల్గొనేందుకు పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో వచ్చే వారి కోసం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రాత్రివేళ సైతం జూదాలు జరిగే అవకాశం ఉన్నందున మరుగుదొడ్లు, విశ్రాంతి మందిరాలను తాత్కాలికంగా నిర్మిస్తున్నారు. మద్యం, అల్పాహారం, బిర్యానీ, భోజనం కూడా అమ్మకానికి పెడుతున్నారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించి ఫీజు వసూలు చేస్తున్నారు. పందేలు జరిగే బరుల వద్ద నిర్వాహకులు సొంత సెక్యూరిటీని, బౌన్సర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. జూదాల్లో తక్షణం అప్పు ఇవ్వడానికి బంగారం, వెండి వస్తువులు, ద్విచక్ర వాహనాలు తాకట్టు వ్యాపారులు కూడా బరుల సమీపంలోనే మకాం వేస్తారు.



తిరువూరు తోకపల్లిలో సిద్ధం చేసిన బరి

రెడ్డిగూడెంలో కోడి పందేల బరులు ధ్వంసం

మైలవరం: రెడ్డిగూడెంలోని రంగాపురం శివారులో రహదారి పక్కన ఏర్పాటు చేసిన కోడి పందేల బరులను రెవెన్యూ అధికారులు శనివారం ధ్వంసం చేశారు. సంక్రాంతి పండుగకు కోడి పందేలు, జూదాలు ఆడేందుకు బరులు సిద్ధం చేస్తున్నారని సమాచారం అందడంతో రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకుని బరులు ధ్వంసం చేశారు.

• జి.కొండూరు: జి.కొండూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న బరులను ఎస్ఐ సతీష్‌కుమార్, తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం ధ్వంసం చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ మునగపాడు, చెర్వుమాధవరం, కొత్తూరు, కోడూరు గ్రామాల్లో బరులను ధ్వంసం చేశామన్నారు. పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

• విస్సన్నపేట: మండలంలోని తాతకుంట్లలో కోడి పందేల బరులను తహసీల్దారు లక్ష్మీ కల్యాణి, ఎంపీడీఓ చిరాట్నాలు, సీఐ గిరిబాబు, ఎస్ఐ రామకృష్ణ తొలగింప జేశారు. వారు మాట్లాడుతూ జూదాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



చెర్వుమాధవరం శివారులో బరిని ధ్వంసం చేయిస్తున్న అధికారులు

ఐఏఎల్ డైరీ ఆవిష్కరణ

మైలవరం: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) 2025 కోర్టు డైరీ, క్యాలెండర్స్‌ను మైలవరం కోర్టు ప్రాంగణంలో శనివారం జూనియర్ జడ్జి ఎం.శైలజ ఆవిష్కరించారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

మైలవరం: మైలవరం పట్టణంలోని లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో శనివారం వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ బాలుర పాఠశాలలో శనివారం, ఆదివారం నిర్వహించే కబాడీ, వాలీబాల్, పోటీలలో యువత పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు



పెనుగొలనులో చిన్నారులకు భోగి పండుగ ఉత్సవం



తిరువూరు ప్రతిభ కళాశాలలో ముగ్గుల పోటీలు

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలనులో శనివారం షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన 30 మంది చిన్నారులకు సంప్రదాయంగా భోగి పండ్లు పోశారు. భోగి పండ్ల వేడుక విశిష్టతను ఐసీడీఎస్ పెనుగొలను సెక్టార్ సూపర్‌వైజర్ రేవతి వివరించారు. గోపూజ, వివిధ రంగులతో చిన్నారులను ఆకర్షించే విధంగా ముగ్గులు వేశారు. రేగిపండ్లు, మంచి శనగలు, పూలు, రూపాయి నాణేలు కలిపి భోగి పండ్లు చిన్నారులకు, విద్యార్థులకు తలపై పోసి ఆశీర్వదించారు. పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్లకు చెందిన కార్యకర్తలు, సాయిబాబా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

• ఇబ్రహీంపట్నం(మైలవరం): కొండపల్లి క్రాంతి హైస్కూల్‌లో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాఠశాలకు హాజరై ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. ఎల్‌కేజీ విద్యార్థులకు భోగి పండ్లు ఆశీర్వదించారు. రంగవల్లులు, బొమ్మల కొలువు, కోలాటం ఆకట్టుకున్నాయి. గాలిపటాలు ఎగుర వేసి సందడి చేశారు. పాఠశాల కరస్పాండెంట్ వెనిగళ్ల మురళీ మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• **ఉత్సాహంగా సంక్రాంతి పోటీలు**

తిరువూరు: సంక్రాంతి సందర్భంగా తిరువూరు ప్రతిభ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. కళాశాల ఆవరణలో జరిగిన పోటీల్లో విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వి. గాయత్రి, ఎం. అపర్ణ, సీహెచ్ శ్రావణి మొదటి మూడు బహుమతులు గెలుచుకోగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు బహుమతి ప్రదానం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

• **యువకులకు కబడ్డీ పోటీలు**

స్థానిక ఇండోర్ స్టేడియం ఆవరణలో యువకులకు తిరువూరు పోలీసులు కబడ్డీ పోటీలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన జట్లు పోటీలో పాల్గొనగా విజేతలకు ఎస్ఐ సత్యనారాయణ బహుమతి ప్రదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో కూడార్తై

గంపలగూడెం: మండలంలోని వైష్ణవాలయాల్లో శనివారం కూడార్తైను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గంపలగూడెం సీతారామ చంద్రస్వామి ఆలయం, భజన మందిరం, ఊటుకూరు, పెనుగొలను రామాలయాలలో నెమలి వేణుగోపాలస్వామి ఆలయం, పెద్దకొమిర, వెంకటేశ్వరస్వామి ఆలయం, గోసవీడు వేణుగోపాలస్వామి ఆలయాలో పాయసాన్నంను 108 గంగాళాల్లో ఉంచి శ్రీకృష్ణ పరమాత్మునికి నివేదన సమర్పించారు. తెల్లవారుజామున తిరుప్పావై పఠించారు.



తిరువూరు: తిరువూరులోని వేంకటాచలస్వామి దేవస్థానం, శ్రీ కోదండ రామాలయం, రాజుపేట వీరాంజనేయస్వామి దేవస్థానాల్లో 108 పాత్రల్లో గోదాదేవికి, ఆళ్వార్లకు నివేదన సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధిపథంలో గొల్లపూడి, గుంటుపల్లి



గొల్లపూడి గ్రామ పరిధిలోని హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్



జాతీయ రహదారిపై పశ్చిమ బైపాస్ బ్రిడ్జి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి, ఇబ్రహీంపట్నం మండలంలోని గుంటుపల్లి గ్రామాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయి. 65వ నంబర్ జాతీయ రహదారిలో పక్కనే ఉన్న ఈ రెండు గ్రామాల మధ్య నూతనంగా పశ్చిమ బైపాస్ నిర్మించారు. ఈ రహదారి వినియోగంలోకి రావడంతో ఆయా గ్రామాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. మైలవరం నియోజకవర్గం పరిధిలోని గొల్లపూడి, గుంటుపల్లి గ్రామాలు విజయవాడ నగర శివార్లుగా ఉన్నప్పటికీ దాదాపుగా నగరంలో కలిసిపోయాయి. రైతువారీ గ్రామాలైనప్పటికీ కాలక్రమేణా పెరుగుతున్న జనాభా, వారి అభిరుచులకు అనుగుణంగా ఆధునిక భవనాలు, అపార్టుమెంట్లతో నగర వాతావరణం సంతరించుకుంది. సామాన్య, మధ్య తరగతి ప్రజలు విజయవాడ నగరంలో గజం స్థలం కూడా కొనలేని పరిస్థితులు నెలకొనడంతో అటువంటివారంతా గొల్లపూడి, గుంటుపల్లి గ్రామాల్లో స్థలం లేదా కట్టిన ఇల్లు కొనుక్కుని ఉంటున్నారు. ముఖ్యంగా ప్రశాంతమైన వాతావరణాన్ని కోరుకునే ఉద్యోగులు ఈ గ్రామాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు.

పుంజుకున్న రియల్ ఎస్టేట్

రాష్ట్ర విభజన అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో అధిక శాతం గొల్లపూడి, గుంటుపల్లి గ్రామాల్లో నెలకొల్పడంతో హైదరాబాద్ నుంచి విజయవాడకు తరలివచ్చిన ఉద్యోగులు, సిబ్బంది గొల్లపూడి, గుంటుపల్లి గ్రామాలకు చేరడంతో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంది. బిల్డర్లు, మధ్యవర్తుల వ్యాపారం మూడు పూలు..ఆరు కాయల చందాన సాగుతోంది. మొత్తం మీద గొల్లపూడి, గుంటుపల్లి గ్రామాలు రోజురోజుకు విస్తరిస్తూ అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయి.

విద్యా సంస్థలు, రెసిడెన్షియల్ కాలేజీలు

గొల్లపూడి గ్రామంలో ప్రముఖ విద్యా సంస్థలకు సంబంధించి రెసిడెన్షియల్ కాలేజీలు ఉండటం కూడా వారికి కలిసి వచ్చింది. వైద్యానికి సంబంధించి పేరొందిన కార్పొరేట్ హాస్పటల్స్ బ్రాంచిలను ఏర్పాటు చేశారు. గతంలోవలే వైద్యం కోసం టూ టౌన్‌కు వెళ్లాల్సిన పనిలేకుండానే అందుబాటులోకి ఆధునిక వైద్యం వచ్చింది.

హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్

వైద్య సేవలతోపాటు వాణిజ్య రంగానికి సంబంధించి మహాత్మాగాంధీ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ గొల్లపూడిలోనే ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు అన్నీ అందుబాటులో ఉండటంతో హ్యాపీగా ఫీలవుతున్నారు. ఇక ఫుడ్ రెస్టారెంట్లు, స్వీట్ షాపులు, ఫంక్షన్ హాల్స్ ఇబ్బడిముబ్బడిగా ఉన్నాయి.

ఆధ్యాత్మికతలోనూ..

ఆధ్యాత్మికంగా చూసినా ప్రసిద్ధి చెందిన అయ్యప్ప స్వామి దేవస్థానం, శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం, శివాలయం, గంగానమ్మ గుడితోపాటు రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనరేట్ కార్యాలయం కూడా గొల్లపూడి గ్రామంలో ఉంది.



గొల్లపూడి అయ్యప్ప స్వామి దేవాలయం



గొల్లపూడిలోని సీజన్స్ స్టే లాడ్జి